## క్లుప్తంగా

### దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



బస్‌పాస్ అందిస్తున్న సర్పంచ్ మల్లేశం

**రామాయంపేట(మెదక్):** నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ చెప్యాల మల్లేశం, మెదక్ డిపో ఆర్టీసీ అధికారులు దివ్యాంగులకు రాయితీతో కూడిన బస్‌పాస్‌లు అందజేశారు. డిపో మేనేజర్ రవిచందర్ ఆదేశాల మేరకు తాము గ్రామానికి వచ్చి అర్హులైన 30 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశామని, 50 శాతం రాయితీపై వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు.

### సంతాపం



అంత్యక్రియలో జెడ్పీటీసీ విజయ్‌కుమార్

**నిజాంపేట(మెదక్):** మండలంలోని తిప్పనగుల్ల గ్రామానికి చెందిన గొట్టిపర్తి బాలాగౌడ్ అంత్యక్రియలో శనివారం జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం కల్వకుంట గ్రామ శివారులో తిప్పనగుల్ల గ్రామానికి చెందిన గొట్టిపర్తి బాలాగౌడ్ (38), అతని భార్య శోభ సిద్దిపేట నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జేసీబీ ఢీ కొని రోడ్డు ప్రమాదంలో బాలాగౌడ్ మృతి చెందాడు. అతని భార్య శోభకు తలకు తీవ్ర గాయలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ఇందులో భాగంగా శనివారం మండల జెడ్పీటీసీ వారి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేసి, బాలాగౌడ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు మృతుని భార్య చికిత్సకు ఆర్థికసాయం అందజేస్తున్నారు.

### శివ్వంపేటలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రం శివ్వంపేటలో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో అబ్దుల్, అజీజ్, రవిగౌడ్, అరుణ్, అంజయ్య, గణేశ్ తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లి రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శశికళ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పిల్లలు, తల్లుల హాజరు, స్టాక్ రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్యలక్ష్మి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమయపాలన పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఫరీద తదితరులు పాల్గొన్నారు.

### 'సేవలను సద్వినియోగం చేసుకోవాలి'



సోలార్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ

**శివ్వంపేట(నర్సాపూర్):** గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీకి సెగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 51 సోలార్ వీధి లైట్లను అందించగా, శనివారం ఆయన ప్రారంభించారు. సెగల్ ట్రస్ట్ చైర్మన్ జై సెగల్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ముఖ్యంగా మౌళిక వసతుల కల్పనతో పాటు వ్యవసాయ సాగులో రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తూ, చెరువుల అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దశరథ్, ఉపసర్పంచ్ భిక్షపతిరావు, ఫౌండేషన్ సిబ్బంది నవనీత, పవన్, సలావుద్దీన్ షఫీ, ఖాసీం, వేమనారాయణ, వెంకట్, లావణ్య, గ్రామస్తులు ఉన్నారు.

# అన్ని మతాలకు ప్రాధాన్యం



రంజాన్ బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నాయకులు

**నర్సాపూర్:** తెలంగాణ వచ్చాక అన్ని మతాలకు ప్రాధాన్యత లభిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక షాదీఖానాలో ముస్లింలకు రంజాన్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆయా మతాల పండుగలకు ప్రభుత్వం తరఫున బహుమతులు అందచేస్తూ, పేదలు సైతం సంతోషంగా పండగలు చేసుకునేందుకు సహాయం చేస్తున్నారన్నారు. బంగారు తెలంగాణ సాధించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ఆయనకు అందరూ అండగా ఉండి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో సీఎం చేపడుతున్న పలు పథకాలను వివరించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా రంజాన్ పండగ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చిన బహుమతులు అందజేశారు.

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు సీఎం కేసీఆర్‌కు ఎంతో ఇష్టమైన పథకాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పారు. మండలంలోని 55 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన 59 జీఓ ద్వారా ఇంటి స్థలాలు రెగ్యులర్ చేయబడిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జెడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, పార్టీ నాయకులు రాంచందర్, హబీబ్‌ఖాన్, నర్సింగ్‌రావు, ఉమ్లానాయక్, ఆంజనేయులుగౌడ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆలయానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లిలో జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంతో కలిసి గిరిజన అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే శ్రీ అభయ సీతారామాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్‌లు శ్రీజ, లచ్చనాయక్, జీవుల నాయక్, రమేశ్, ఎంపీటీసీ సునీత, నాయకులు దశరథ్, కృష్ణనాయక్, లక్ష్మణ్, నర్సింహరెడ్డి, సారా రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**సన్మానం**

**కౌడిపల్లి(నర్సాపూర్):** అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవకు ప్రభుత్వం దళితరత్న అవార్డును అందజేశారు. దీంతో శనివారం కౌడిపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో సంజీవ్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు ఉన్నారు. అంతకు ముందు రాయిలాపూర్ గ్రామంలో సర్పంచ్ కురుమ శేఖులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నల్లపోచమ్మదేవి ఆలయ ధర్మకర్త సంతోషకుమార్, మాజీ సర్పంచ్ శంకరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహేందర్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

**ఎల్‌ఓసీ పంపిణీ**

**వెల్దుర్తి(తూప్రాన్):** మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గాయత్రి అనే యువతి షుగర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ.50000 ఎల్‌ఓసీ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం గాయత్రి తండ్రి తిమ్మయ్యకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

## 'రెవెన్యూ డివిజన్ అయ్యేదాకా దీక్ష విరమించం'



దీక్ష చేస్తున్న అఖిలపక్షం నేతలు

రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు

**రామాయంపేట(మెదక్):** రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో దీక్షలు కొనసాగుతున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షలు ప్రారంభమై శనివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో తుల్జాభవాణీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించేవరకు తాము దీక్షలను విరమించమని స్పష్టం చేశారు. రామాయంపేట అభివృద్ధి విషయమై అధికార పార్టీ నాయకులు ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. గతంలో మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన భేతాళస్వామి ఉత్సవాలు



బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

**అల్లాదుర్గం(మెదక్):** మండల కేంద్రం అల్లాదుర్గంలో కొలువుదీరిన భేతాళ స్వామి ఉత్సవాలు వారం రోజులుగా వైభవంగా జరిగాయి. శనివారం పాసి బండ్ల ప్రదక్షిణలతో ఉత్సవాలు ముగిశాయి. భేతాళ స్వామికి బండ్లతో ప్రదక్షిణలు చేసి, శనివారం కూడా అవే బండ్లను దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు. జాతరలో భాగంగా భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. అల్లాదుర్గంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు భేతాళ స్వామిని దర్శించుకొని దీపారాధన చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

## సొంత పార్టీ వారే అణగదొక్కాలని చూస్తున్నారు ?

ప్రొటోకాల్ విషయంలో కొల్చారం ఎంపీపీ మంజుల ఆవేదన



మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

**కొల్చారం(నర్సాపూర్):** ప్రొటోకాల్ పాటించే విషయంలో సొంత పార్టీ వారే తనను అణగదొక్కాలని చూస్తున్నారని ఎంపీపీ మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ఎనగండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జెడ్పీటీసీ సొంత గ్రామం వరిగుంతంలో ఈనెల 8న అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై తన పేరు లేకపోవడం, ఎంపీపీ మహిళ అని చిన్నచూపు అని ప్రశ్నించారు. ఈ విషయమై అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, అంబేడ్కర్ జయంతి రోజు వరకు మార్చాలని అక్కడి నిర్వాహకులను ఆదేశించారన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు చెక్కుల అందజేత



చేగుంట(తూప్రాన్): చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు



రామాయంపేట(మెదక్): రైతుకు చెక్కు అందిస్తున్న సంఘం చైర్మన్

**చేగుంట(తూప్రాన్):** రెండేళ్ల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సాయిలు కుటుంబ సభ్యులకు నష్ట పరిహార చెక్కును శనివారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు అందజేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దూరి సాయిలు విద్యుత్ షాక్‌తో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఎమ్మెల్యే బాధితులకు పరిహారం అందించాలని విద్యుత్ అధికారులతో బాధితుల తరఫున పోరాటం చేశారు. విద్యుత్ శాఖ తరఫున రూ.5లక్షల పరిహారం మంజూరీ కాగా సంబంధిత చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యువమోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు భిక్షపతి, వేణు, రమేశ్ తదితరులు ఉన్నారు.

**రామాయంపేట(మెదక్):** మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు రమావత్ పూల్యాకు కోళ్ల ఫారం నిర్మాణానికి మంజూరైన రూ. 12 లక్షల చెక్కును శనివారం సహకార సంఘం చైర్మన్ చంద్రం అందజేశారు. సంఘం తరఫున రైతులకు రుణాలివ్వడానికి గాను తాము ఎల్లవేళలా ముందుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ పుట్టి నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో భక్తుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**శివ్వంపేట(నర్సాపూర్)** మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, పూజారులు దేవిశ్రీ, ప్రభుశర్మ, శ్రీవాత్సవ్, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

నార్సింగి మండల బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**రామాయంపేట(మెదక్):** నార్సింగి మండలంలో కొనసాగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు ఆరోపణలు చేస్తున్నారని మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బాబు, మాజీ అధ్యక్షుడు తౌర్యానాయక్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి భూపతిరాజ్, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు అంచనూరి రాజేశ్, జిల్లా నాయకులు గణేశ్ శనివారం నార్సింగిలో విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో ఎలాంటి అసమ్మతి లేదని, అంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ఇతర పార్టీలకు చెందిన కొందరు పార్టీని అప్రతిష్టపాలు చేయడానికి కుట్రలు చేస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వమని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనవసర ఆరోపణలు చేస్తున్నవారు ఇకనైనా తమ వైఖరి మార్చుకొని అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు.

## వైభవంగా వేంకటేశ్వర కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కల్యాణోత్సవంలో భక్తులు

**పెద్దశంకరంపేట(మెదక్):** పెద్దశంకరంపేటలోని గోదా సహిత లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, కేంద్ర ఎఫ్‌సీఐ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పూజలు చేపట్టి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, స్వప్న రాజేశ్వరరావు, నాయకులు విగ్రాం గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కనుల పండువగా పెద్దమ్మ కల్యాణం**

**నిజాంపేట(మెదక్):** మండలంలోని నార్లాపూర్ గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసుదన్ రెడ్డి, లింగంగౌడ్, మోహన్ రెడ్డి, నరేందర్, చంద్రం, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, రెడ్డి సంఘం సభ్యులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** రెడ్ల ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒంటరి రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 28న మెదక్‌లో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనంలో రెడ్డి సామాజికవర్గం నాయకులు విధిగా హాజరు కావాలని చెప్పారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారం కోసం చర్చించే సమ్మేళనానికి రెడ్డి కులస్తులు హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మనోహరాబాద్(తూప్రాన్): సమ్మె నోటీసును అందిస్తున్న కార్యదర్శులు

**పెద్దశంకరంపేట(మెదక్):** జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం సమ్మె నోటీసును మండల పరిషత్ అధికారులకు అందజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తమను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. లేని పక్షంలో ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

**కౌడిపల్లి(నర్సాపూర్):** గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కౌడిపల్లి ఎంపీడీ కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీస్ అందచేశారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు గోల్యానాయక్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకటేశం, సీనియర్ అసిస్టెంట్ బలరాంకు సమ్మెనోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్, ప్రసాద్, సౌజన్య, శైలజ, సలీం తదితరులు పాల్గొన్నారు.

**చేగుంట(తూప్రాన్):** పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని ఎంపీపీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం మండలశాఖ అధ్యక్షులు సంతోష్, ఎల్లం, ప్రశాంత్, కల్పన, ప్రియాంక, మైనిక, శ్రీకాంత్, జగదీష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్యలకు సమ్మె నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**పెద్దశంకరంపేట(మెదక్):** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పెద్దశంకరంపేటలో ఎంపీపీ శ్రీనివాస్ చేతులు మీదుగా వాల్ పోస్టర్‌లను ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఓ శ్రీశైలం, రాజేందర్‌లు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లతో పాటు ఆయా కేంద్రాల వద్ద పోస్టర్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని వారు సూచించారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నేడు పేటలో మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష**

**పెద్దశంకరంపేట(మెదక్):** పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ విఠల్‌నాయక్, డీఓ వెంకటేశంలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతికి ఉదయం 10 నుంచి 12 వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వారు సూచించారు.

**చిన్నశంకరంపేట(మెదక్):** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కోసం ఉదయం 10 నుంచి 12 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 7వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. హాల్ టికెట్‌తో విద్యార్థులు పరీక్షల కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని కోరారు.

**◆ సంఘం బలోపేతానికి కృషి**

**నర్సాపూర్:** జిల్లాలో పద్మశాలి సంఘం బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు వీరభద్రయ్య చెప్పారు. శనివారం నర్సాపూర్ పద్మశాలి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం బలోపేతం చేసేందుకు ప్రధానంగా అందరు సభ్యత్వం తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా సంఘం నాయకులు శ్రీపాల్, కందిప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**◆ బీఆర్ఎస్ సమావేశం ఉందని, ఉపాధి పనులు బంద్ చేస్తారా ?**

**కౌడిపల్లి(నర్సాపూర్):** బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం ఉందని మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం ఉపాధిహామీ పనులు బంద్ చేయడం ఎంత వరకు సమంజసమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజిపేట రాజేందర్ ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తిమ్మాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఉపాధి హామీ పనులు బంద్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఒత్తిడి తెచ్చి బంద్ చేయించారని చెప్పారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

**ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ..**


ఈ విషయమై తిమ్మాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్‌ను వివరణ కోరగా.. ఉపాధిహామీ పనులు బంద్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు చెప్పారని తెలిపారు. కాగా స్థానిక చెరువులో శుక్రవారం పూడికతీత పనులు చేపట్టగా, 338 మంది కూలీలు పనికి వచ్చారని శనివారం పూడికతీత పనులకు ఎవరు రాలేదని, ప్లాంటేషన్ పనులకు మాత్రం కేవలం ముగ్గురు మాత్రమే వచ్చారని చెప్పారు.

**◆ 17 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె**



**తూప్రాన్:** విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకు ఈ నెల 17 నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ రాజమల్లేశం, ఏఈలు వెంకటేశం, దుర్గప్రసాద్, బాబు, చందు, శ్రీనివాస్‌రెడ్డి, షాదుల్ హుస్సేన్, నర్సింలు, శ్రీధర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

**◆ బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ**



**మెదక్ మున్సిపాలిటీ:** పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 9 నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంచి మధుసూదన్, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు దుర్గ ప్రసాద్, సుమన్, నిఖిల్, పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

**◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**



**తూప్రాన్:** మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి కుమారుడు సూర్యతేజ్‌రెడ్డికి శనివారం రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ అందజేశారు. నాయకులు బాలేశ్, సిద్ధిరాములు, వెంకటనారాయణ, కృష్ణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ 'అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తాం'**

**చేగుంట(తూప్రాన్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తామని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మక్కరాజీపేటలో ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**◆ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు**

**పాపన్నపేట(మెదక్):** ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు క్రమబద్ధీకరణకు ఈనెల 30 లోగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని పాపన్నపేట తహసీల్దార్ మహేందర్ కుమార్ కోరారు. జూన్, 2, 2020కి ముందు ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణం చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే అప్పట్లో పంచాయతీ అనుమతి, కరెంట్ మీటర్ తదితర అర్హతలు కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. జీఓ నంబర్ 59,60 ప్రకారం అర్హతలు నిర్ణయిస్తారని చెప్పారు.

**◆ మాజీ సర్పంచ్ మృతి**



మొగులయ్య (ఫైల్)

**నర్సాపూర్:** మండలంలోని ఇబ్రహీంబాద్ మాజీ సర్పంచ్ మొగులయ్య (58) శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయన ఇబ్రహీంబాద్ సర్పంచ్‌గా 2001 నుంచి 2006 వరకు పని చేశారు. ఆయన ప్రస్తుతం నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కాగా ఆయన ఇటీవల అస్వస్థతకు గురవడంతో వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, శనివారం మరణించారు. కాగా మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.